సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



ఆశలు పదిలం

కోయిల్‌సాగర్ పరిధిలోని ఆయకట్టుకు నేటి నుంచి సాగునీటిని వదలనున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /16.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

నేడు అయ్యప్పకొండపై మహాపడి పూజ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని అయ్యప్ప కొండపై బుధవారం 27వ వార్షికోత్సవ అయ్యప్పస్వామి మహాపూజ నిర్వహించనున్నారు. ఈ మేరకు అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి 8.30 గంటల వరకు సుప్రభాత సేవ, గణపతి, నవగ్రహ హోమం, నిత్యాభిషేకం, అనంతరం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 10 గంటలకు స్థానిక తూర్పు కమాన్ వద్ద గల రామాలయం నుంచి కలశ, స్వామి వారి పల్లకీ సేవ ప్రారంభమై పట్టణ ప్రధాన రహదారుల మీదుగా అయ్యప్ప కొండ ఆలయం వరకు కొనసాగుతుంది. అష్టాభిషేకం పూజల అనంతరం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుపతికి చెందిన వెంకటేశ్వర చంద్రమౌళి శర్మ, పాలమూరు పట్టణ గురుస్వాముల ఆధ్వర్యంలో ఏకశిల దివ్య పదునెట్టాంబడి, మహా మంగళహారతి పూజలు నిర్వహించనున్నారు.



విద్యుత్‌దీపాల వెలుగులో క్రీస్తుజ్యోతి చర్చి

క్రిస్మస్ పర్వదినానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుత్ దీపాల అలంకరణలతో జిల్లాకేంద్రంతో పాటు జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ పట్టణాల్లో చర్చిలన్నీ వెలుగులీనుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి పలు చర్చిల్లో కేకులు కట్ చేశారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

- వివరాలు 11లో..



క్రిస్టియన్‌పల్లి చర్చి వద్ద క్రిస్మస్ ట్రీ, పశువుల పాక

అమిత్ షా రాజీనామా చేయాలి

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి
- పాలమూరులో కాంగ్రెస్ నిరసన ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, పలువురు చైర్మన్లు



అంబేడ్కర్ చిత్రపటాలతో ర్యాలీ చేస్తున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిరుధ్, యెన్నం, జీఎమ్మార్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా జిల్లాకేంద్రంలో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక డీసీసీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, వందలాది మంది కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పలువురు చైర్మన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభలో అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలను యావత్ దేశంలోని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రయత్నిస్తుంటే, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, చైర్మన్లు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ.వెంకటేశ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, నాగరాజు, రాములుయాదవ్, అరవింద్‌రెడ్డి, అజ్మత్‌అలీ, అవేజ్, గంజి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన స్థానిక కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మైత్రి ప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు ప్రైవేట్ సంస్థల్లో 400 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఈ మేళాకు జిల్లాలో ఉన్న నిరుద్యోగులు హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 9948568830, 9550205227, 9175305435 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చైతన్యంతోనే వినియోగదారుల హక్కుల పరిరక్షణ

- అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజల్లో చైతన్యంతోనే వినియోగదారుల హక్కుల పరిరక్షణ సాధ్యమని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఒక అంశంతో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు, ఈ సంవత్సరం 'డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారుల న్యాయం' అనే అంశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ యుగంలో ఏవిషయమైనా తొందరగా వ్యాపిస్తుందన్నారు. ప్రజల బలహీనతలతో వ్యాపారులు వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ బాలలింగయ్య మాట్లాడుతూ హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలన్నారు. నాణ్యమైన వస్తువు కొనాలని, నష్టపోతే పరిహారం పొందే హక్కు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ మాజీ సభ్యుడు ఆడమ్స్ మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ చట్టం వినియోగదారుల పక్ష పాతి అని అన్నారు. వినియోగదారుల ఉద్యమం ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, జిల్లా తూనికలు, కొలతల అధికారి రవీందర్ పాల్గొన్నారు

పాలమూరు యూనివర్సిటీలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకుడు అర్జున్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపార దోపిడీ, మోసపూరిత కాల్స్, ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులు నాగసుధ, జావీద్ అహ్మద్, అరుంధతిరెడ్డి పాల్గొన్నారు.

గుల్బర్గాలోని డంపింగ్ యార్డు పరిశీలన



గుల్బర్గాలో కన్వేయర్ బెల్ట్ యంత్రం ప్లాంటును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తడి, పొడి చెత్తను పూర్తి స్థాయిలో రీసైక్లింగ్ చేసే కన్వేయర్ బెల్ట్ యంత్రాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. దీని కోసం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా మున్సిపాలిటీ పరిధిలోని ఈ ప్లాంటును సందర్శించారు. అక్కడ ఆ యంత్రం పనితీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని తిరిగి వచ్చారు. అయితే ఈ ప్లాంటు ఏర్పాటుకు కనీసం రూ.80 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందని అంచనా వేశారు. వాస్తవానికి మహబూబ్‌నగర్ పట్టణంలోని డంపింగ్ యార్డులో ప్రతినిత్యం వంద మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. ఈ యంత్రం ద్వారా 60 మెట్రిక్ టన్నులు ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయవచ్చు. దీనిని ఇక్కడే ఏర్పాటు చేస్తే నిర్వహణ బాధ్యతలు తామే చూసుకుంటామని శ్రీ సిమెంట్ లిమిటెడ్ యాజమాన్యం ముందుకు వచ్చింది. దీని ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఉల్లి ధర

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. గత వారం వచ్చిన ధరలే ఈ వారం నమోదయ్యాయి. బుధవారం క్రిస్మస్ సెలవు కావడం వల్ల ఒక రోజు ముందుగానే ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహించారు. బహిరంగవేలంలో ఉల్లి ధర గరిష్టంగా రూ.3,610, కనిష్టంగా రూ.3,100 పలికింది. కాగా.. మధ్యాహ్నం జరిగిన ఈ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,219, కనిష్టంగా రూ.7159, ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ.2,569గా ఒకే ధర లభించింది. క్రిస్మస్, బాక్సింగ్ డే సందర్భంగా మార్కెట్‌కు రెండు రోజుల పాటు సెలవు ఉంటుందని, తిరిగి ఈ నెల 27న లావాదేవీలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం


రామస్వామి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. జిల్లాకేంద్రానికి చెందిన రామస్వామి (45) ఎస్పీ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండేవాడు. మంగళవారం బైక్‌పై వెళ్తూ జిల్లాకేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రామస్వామికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి


ట్రాక్టర్ కింద మహేష్ మృతదేహం

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన శివ, మహేష్ (18) కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం ట్రాక్టర్‌తో దున్నడానికి వెళ్లాడు. మరోరైతు పొలంలోకి వెళ్లే క్రమంలో ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. శివ ప్రాణాలతో బయటపడగా.. మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష్ నాగర్‌కర్నూల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండేవాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హన్వాడలో చెరువులో పడి..


బైకని నవీన్ (ఫైల్)

హన్వాడ: మండల కేంద్రానికి చెందిన బైకని నవీన్‌కుమార్ (17) మృతదేహం మంగళవారం స్థానిక పెద్ద చెరువులో కనిపించింది. అటుగా వెళ్లిన వారు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. నవీన్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటూ ఉదయం వేళ పేపర్‌బాయ్‌గా పనిచేస్తుండేవాడు. నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైన గొడవపడి ఇలా చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హన్వాడ పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తండ్రి బైకని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ఎద్దులబండి కిందపడి చిన్నారి..

తాడూరు: ఎద్దులబండి చక్రాల కిందపడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని ఇంద్రకల్‌లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలస్వామి, చెన్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఝాన్సీ, హన్సిక (6) ఉన్నారు. తల్లిదండ్రులతో కలిసి ఎద్దుల బండిపై పొలానికి వెళ్తుండగా.. బండి చక్రాలు రాళ్లపై ఎక్కడంతో అదుపుతప్పింది. దీంతో పట్టు కోల్పోయిన హన్సిక కిందపడగా పైనుంచి చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

ఆశలు పదిలం

నేటి నుంచి కోయిల్‌సాగర్ నీటి విడుదల

- యాసంగి పంటలకు అందనున్న సాగునీరు
- షెడ్యూల్ ఖరారు చేసిన అధికారులు
- ఊసులేని పాత కొత్త ఆయకట్టు..
- సిద్ధమైన నారుమళ్లు.. ప్రస్తుతం 31.6 అడుగుల నీటిమట్టం


మరికల్ శివారులో సిద్ధంగా నారుమడి



దేవరకద్ర/మరికల్: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై రైతుల ఆశలు పదిలం అయ్యాయి. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో బుధవారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు విడతల వారిగా నీటిని విడుదల చేయాలని షెడ్యూల్ ఖరారు చేశారు. దీంతో యాసంగి పంటలకు సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 31.6 అడుగుల మేర నీటి నిల్వ ఉంది.

పాత ఆయకట్టుకే..

యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా పాత ఆయకట్టుకు నీటిని వదులుతారు. వానాకాలంలో మూడు నెలల పాటు నిరంతరం నీటిని వదలడంతోపాటు తీలేరు, ఉంద్యాల వద్ద లింక్ కెనాల్స్ ద్వారా సాగుకు నీటిని అందించారు. అలాగే గొలుసు కట్టు చెరువులను నింపి పంటలకు నీటిని వదలడంతో పాత ఆయకట్టుతోపాటు అదనపు ఆయకట్టు కలుపుకొని దాదాపు 35 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ప్రాజెక్టులో ఉన్న నీటితోనే పంటలకు నీటిని వదలడం వల్ల కేవలం పాత ఆయకట్టు దేవరకద్ర, కౌకుంట్ల, కుడి కాల్వ కింద ధన్వాడ, మరికల్, చిన్నచింతకుంట మండలాల పరిధిలోని 12 వేల ఎకరాలకే సాగునీరు అందే అవకాశం ఉంటుంది. అది కూడా విడతల వారిగా మధ్యలో విరామం ఇస్తూ ఐదు తడులుగా నీటిని వదులుతారు. దీంతో ప్రాజెక్టులో ఉన్న రెండు టీఎంసీల నీటిలో ఒక టీఎంసీని పంటలకు, మరో టీఎంసీ నీటిని తాగునీటికి ఉపయోగిస్తారు.

నీటి విడుదల షెడ్యూల్ ఇలా..

తడులు	నీటి విడుదల తేదీలు	తడి రోజులు
మొదటిది	25.12.2024 - 8.1.2025	15
రెండోది	24.1.2025 - 31.1.2025	8
మూడోది	13.2.2025- 20.2.2025	8
నాలుగోది	5.3.2025 - 13.3.2025	9
ఐదోది	25.3.2025 - 3.4.2025	10

నీటిని వృథా చేయొద్దు



ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో 31.6 అడుగుల నీటి మట్టం ఉంది. యాసంగి సీజన్‌లో పాత ఆయకట్టు కింద ఉన్న భూములకే సాగునీటిని అందిస్తాం. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3 వరకు 5 విడతల్లో నీటిని వదులుతాం. 50 రోజులు నీటి విడుదల, 50 రోజులు విరామం ఉంటుంది. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రతాప్‌సింగ్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఈఈ


కోయిల్‌సాగర్ కుడి కాల్వ ద్వారా వస్తున్న సాగునీరు (ఫైల్)

మరమ్మతు చేయాలి..



నీటిని వదలడానికి ముందే పిల్ల కాల్వల్లో పేరుకు పోయిన గడ్డి, ముళ్ల చెట్లను తొలగించాలి. కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చూడాలి. లేకుంటే నీరంతా కాల్వల ద్వారా కాకుండా పొలాల్లో పారుతుంది. దీని వల్ల నీటి వృథా ఎక్కువ అవుతుంది. అధికారులు పిల్ల కాల్వలపై దృష్టిసారించి.. మరమ్మతు చేపట్టాలి.

– రవీందర్‌రెడ్డి, రైతు, నాగారం, దేవరకద్ర మండలం

కొత్త ఆయకట్టు చేర్చాలి..



కోయిల్‌సాగర్ కింద తీసిన కొత్త ఆయకట్టుకు కూడా సాగునీరు అందించాలి. ఇందుకోసం కొత్తగా తీసిన లింక్ కెనాల్‌కు తూములు ఏర్పాటు చేసి పిల్ల కాల్వల ద్వారా పంటలకు సాగు నీరు అందిస్తే యాసంగిలో వరి సాగు చేస్తాం. వర్షాకాలంలో మాత్రమే కేవలం కోయిల్‌సాగర్ లిఫ్టు నుంచి కొత్త ఆయకట్టు కోసం తీసిన ప్రధాన కాల్వలకు నీళ్లు వస్తున్నాయి. యాసంగిలో చుక్కనీరు రావడం లేదు.

– రాములు, రైతు, మరికల్

చివరి ఆయకట్టుకు అందించాలి..



యాసంగి సీజన్‌లో నీటిని చివరి ఆయకట్టు వరకు అందించాలి. కుడి కాల్వలో నీటిని వదిలి తర్వాత చివరి ఆయకట్టుకు తక్కువగా వస్తుంది. కొన్నిసార్లు నీరు రాక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చివరి ఆయకట్టుకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. నీటిని వదిలిన సమయంలో కాల్వపై అధికారులు పర్యవేక్షణ చేయాలి.

– రమేశ్, రైతు, నెల్లికొండి, చిన్నచింతకుంట మండలం

చివరి వరకు నీరు చేరడం లేదు

యాసంగిలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసే సాగునీరు చివరి ఆయకట్టు వరకు రావడం లేదు. దీంతో వేసవిలో పంటలకు నీరు అందక ఎండుముఖం పట్టిన సందర్భాలు ఉన్నాయి. పంటలు కోతకు వచ్చే సమయంలో నీళ్లు లేక దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది. చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సింది ఎంతైన ఉంది.

– మల్లేష్, పెద్దచింతకుంట

ప్రతి బాధితురాలికి న్యాయం అందాలి

- న్యాయమూర్తి ఇందిర



మహబూబ్‌నగర్ క్రైం: భరోసా సెంటర్‌కు వచ్చే ప్రతి బాధితురాలికి సత్వర న్యాయం అందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఇందిర అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంల మాట్లాడారు. జిల్లాలో మహిళల భద్రత, పిల్లల రక్షణ, బాధితులకు న్యాయం అందించడంలో సంబంధిత విభాగాల మధ్య సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. భరోసా కేంద్రం బాధితుల పునరావాసం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని, ఈ కేంద్రం ద్వారా లైంగిక వేధింపులు, గృహహింస, బాలలపై హింసకు గురైన బాధితులకు న్యాయ, వైద్య, మానసిక మద్దతు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, సీడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, ఆర్‌ఎంఓలు డాక్టర్ శిరీష, జరీనా, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీయూ క్రికెట్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ గేట్ పురుషుల క్రికెట్ జట్ల ఎంపికలు మంగళవారం మహబూబ్‌నగర్‌లోని ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీలను పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కుమారస్వామి, పీడీ శ్రీనివాస్, సత్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశం


అదృశ్యమైన అఖిల్

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో ఆరేళ్ల బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. వివరాలు.. అమ్మాపురం గ్రామానికి చెందిన వడ్డెర దశరత్, శిరీషల కుమారుడు అఖిల్. సోమవారం వారు ఇంటివద్ద తాత దగ్గర వదిలి తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లారు. అఖిల్ ఆడుకుంటూ మధ్యాహ్నం అదృశ్యమయ్యాడు. తాత ఎంత వెతికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. వారు వచ్చి గ్రామంలోని పురవీధుల్లో వెతికారు. కనపించకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అఖిల్ ఆకు పచ్చచొక్కా, నీలం ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 8712659354, 8712659316 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

ప్రపంచానికి మహబూబ్‌నగర్ బ్రాండ్ ఇమేజ్

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- మహిళకు ఆయా ట్రేడ్‌ల మెటీరియల్ అందజేత


మహిళలకు కోర్సు మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వశక్తితో ఈ ప్రాంత మహిళలు రోల్ మోడల్‌గా ఎదగాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బీకేరెడ్డికాలనీలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 240 మంది మహిళలకు కోర్సు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న శిక్షణ తమ జీవితానికి ఆధారం కావాలన్నారు. 'మీ అందరి సహకారంతో మహబూబ్‌నగర్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది..' అని అన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎస్.వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబ, రాములు యాదవ్, గుండా మనోహర్ పాల్గొన్నారు.

శానిటైజర్ డబ్బా పేలి ముగ్గురికి గాయాలు

మద్దూరు: శానిటైజర్ డబ్బా పేలి ముగ్గురికి గాయాలైన సంఘటన మద్దూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని భాస్కర్ తన ఇంటిని శుభ్రంచేసే క్రమంలో ఇంట్లో ఉన్న చెత్తాచెదారం బయటకు తీసి మంటలో వేశారు. ఈ క్రమంలోనే కరోనా టైంలో తీసుకువచ్చిన హ్యాండ్ శానిటైజర్‌ను సైతం బయటకు తీసి మంటలో వేయగా.. పెద్ద శబ్దంతో పేలింది. అక్కడే ఉన్న భాస్కర్, బాలుడు డబ్బు ప్రవీణ్, మోనాపురం రాజేష్ శానిటైజర్ వారి శరీరంపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టు పక్కల వారు 108లో మద్దూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చెప్పారు.

మహమ్మద్ రఫీకి ఘన నివాళి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహమ్మద్ రఫీ జయంతిని పురస్కరించుకుని కళాకారులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల సంగీత నృత్య కళాశాల కార్య నిర్వాహక కార్యదర్శి కె.లక్ష్మణ్ మాట్లాడారు. రఫీ పాడిన పాటలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.రాములు, కళాకారులు వి.నారాయణ, వి.వి.రామిరెడ్డి, ఎన్.నర్సింహులు, భాస్కర్, భరత్, సాయిలు, ఖాసీం, రామకళ, బి. హరిప్రసాద్ పాల్గొన్నారు.

కోర్టులో ఈసేవ కేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం సాయంత్రం జిల్లా అదనపు న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి ఈ సేవకేంద్రం ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసేవ కేంద్రం ద్వారా కక్షిదారులు వారి కేసుల విషయాలు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. జడ్చర్ల అదనపుకోర్టు న్యాయమూర్తి ముద్దసిర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రావు, మాలిక్‌షాకీర్, ఆర్. శ్రీనివాస్‌గౌడ్, విశ్వేశ్వర్, పురుషోత్తం, ఇఫ్తెకార్, సీఐ ఆదిరెడ్డి, నాగార్జున్‌గౌడ్, కోర్టు సిబ్బంది కైకేయి, మహేష్ పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రానికి 15పడకలు వితరణ

పాలమూరు: స్థానిక జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ 15పడకలను అందజేశారు. ఈ కేంద్రంలో వృద్ధులు ఉంటారని, మెప్మా, మున్సిపాలిటీ, నవభారతి పట్టణ మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ఈఎన్‌టీ వైద్యుడు శ్రీకాంత్, ఆర్‌ఎంవో శ్వేత, వెంకటేశ్వర్లు, గౌస్, శివ, రాజు పాల్గొన్నారు.

కందులు క్వింటా రూ.7339

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్ యార్డులో కందులు క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,339, కనిష్ఠంగా రూ.6101 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్ఠంగా రూ.6,468, కనిష్ఠంగా రూ.4,803, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,424, కనిష్ఠంగా రూ.2,341, ధాన్యం హంస గరిష్ఠంగా రూ.2,127, కనిష్ఠంగా రూ.1,949, ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠంగా రూ.2,691, కనిష్ఠంగా రూ.1,949 ధరలు పలికాయి.

ముగిసిన వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లు


మూడోరోజు పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

- క్వార్టర్స్‌కు చేరిన 16 జట్లు

కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–19 బాలుర వాలీబాల్ పోటీల్లో భాగంగా మంగళవారంతో లీగ్ మ్యాచ్‌లు మొత్తం ముగిశాయి. 21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలు, 7 కేంద్ర విద్యా సంస్థలకు చెందిన 32 జట్ల మధ్య మూడు రోజులుగా హోరాహోరీగా కొనసాగిన పోటీల్లో 16 జట్లు విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాయి. మిగిలిన రెండు రోజుల్లో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.


ఉత్తరప్రదేశ్- చత్తీస్‌ఘడ్ జట్ల మధ్య పోరు

హోరాహోరీ పోటీల్లో..

మంగళవారం మూడోరోజు వాలీబాల్ హోరాహోరీ పోటీల్లో 16 జట్లు విజేతలుగా నిలిచి ప్రీ క్వార్టర్స్‌కు చేరాయి. మంగళవారం పోటీల్లో పాల్గొన్న జట్లు, విజేతలైన జట్ల వివరాలు పరిశీలిస్తే.. గుజరాత్ జట్టు సీబీఎస్‌ఈ వెల్ఫేర్ జట్టుపై 25- 11, 25- 18 స్కోర్‌తో గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ జట్టు జమ్ము కాశ్మీర్‌పై 25- 17, 25- 15 స్కోర్‌తో, తమిళనాడు జట్టు ఢిల్లీపై 26- 24, 15- 9 స్కోర్‌తో, కర్ణాటక జట్టు తెలంగాణపై 25- 20, 25- 21 స్కోర్‌తో, హరియాణా జట్టు ఆంధ్రప్రదేశ్‌పై 17- 25, 25- 21, 15- 9 స్కోర్‌తో, దాద్రనగర్ హవేలి జట్టు ఐపీఎస్‌సీపై 25- 23, 15- 25, 15- 10 స్కోర్‌తో, రాజస్థాన్ జట్టు సీఐఎస్‌సీఈపై 25- 21, 25- 14 స్కోర్‌తో, కేరళ జట్టు ఐబీఎస్‌ఓపై 25- 2, 25- 2 స్కోర్‌తో, ఒడిశా జట్టు ఎన్‌వీఎస్‌పై 25- 5, 25- 14 స్కోర్‌తో, పంజాబ్ జట్టు చండీఘర్‌పై 25- 13, 25- 17 స్కోర్‌తో, ఉత్తరాఖండ్ జట్టు విద్యాభారతిపై 25- 19, 25- 15 స్కోర్‌తో, మహారాష్ట్ర జట్టు బిహార్‌పై 25- 15, 25- 13 స్కోర్‌తో, హిమాచల్‌ప్రదేశ్ జట్టు జార్ఖండ్‌పై 25- 14, 25- 13 స్కోర్‌తో, పుదుచ్చేరి జట్టు లక్షద్వీప్‌పై 25- 22, 25- 18 స్కోర్‌తో, చత్తీస్‌ఘడ్ జట్టు పశ్చిమ బెంగాల్‌పై 19- 25, 25- 11, 16- 14 స్కోర్‌తో, సీబీఎస్‌ఈ జట్టు మధ్యప్రదేశ్ జట్టుపై 25- 20, 25- 19 స్కోర్‌తో విజయం సాధించాయి.

రాతి గోడపై.. టమాట



సాధారణంగా టమాట చెట్లు తోటల్లో, ఇంటి పెరట్లో, అక్కడక్కడ పెంటకుప్పల్లో పెరుగుతాయి. కానీ, ఇక్కడ మాత్రం రావి చెట్టును తీసిపోని విధంగా ఓ టమాట మొక్క ఇంటి రాతి గోడపై మొలవడమే కాకుండా ఏకంగా కాయలు సైతం కాశాయి. అమరచింతలోని వడ్ల శేషయ్య ఇంటి వెనక రాతిగోడపై కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. - అమరచింత

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- హల్‌చల్ చేస్తున్న దొంగలు
- రూరల్ పరిధిలో వరుస ఘటనలు


ఖిల్లాఘనపురంలో బంగారు దుకాణంలో ఫింగర్ ప్రింట్ సేకరిస్తున్న క్లూస్‌టీం

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. కొందరు ముఠాగా తిరిగితే.. మరి కొందరు ఒంటరిగా చోరీలకు పాల్పడుతున్నారు. పాలమూరు పట్టణంలో హల్‌చల్ చేస్తున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. లక్ష్మీనగర్ కాలనీలో వరుసగా జరిగిన ఘటనలు మరవకముందే మళ్లీ తాజాగా ఆదివారం అర్ధరాత్రి పద్మావతి కాలనీలో ఓ ఇంట్లో ముగ్గురు దొంగలు దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన ఆ ఇంటి యాజమాని, ఇతర కుటుంబ సభ్యులు ఇంటికి తాళమేసి పట్టణంలో ఉన్న బంధువుల ఇంటికెళ్లారు. అర్ధరాత్రి ముగ్గురు యువకులు ముసుగులు వేసుకుని ఇనుపరాడ్లతో ఇంటి కాంపౌండ్‌లో నుంచి ఇంట్లోకి ప్రవేశించారు. తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ఇంటి బయట కట్టివేసిన జర్మన్ షఫడ్ కుక్క దొంగలపైకి తిరగబడి దాడి చేయడానికి ప్రయత్నం చేయగా వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈదృశ్యాలు ఇంటి ఆరుబయట ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయంపై రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఘటన స్థలాన్ని పరిశీలించామని, ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు తేలిందని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

బంగారు దుకాణంలో చోరీ

ఖిల్లాఘనపురం: తాళం వేసి ఉన్న ఓ బంగారు దుకాణంలో చోరీ జరిగిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాలు.. ఖిల్లాఘనపురంలోని రావిచెట్టు ప్రాంతంలోస్వర్ణకారుడు నారాయణదాసు వెంకటేష్‌చారి బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం ఆయన తన సోదరుడు శివకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో దుకాణానికి తాళం వేసి మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 8గంటలకు ఆయన దుకాణం వద్దకు వెళ్లాడు. దుకాణం తాళం విరగొట్టి ఉండటంతో తలుపులు తెరిచి చూశాడు. దుకాణంలో ఉన్న 14గ్రాముల బంగారు, 615 గ్రాముల వెండి ఆభరణాలు దొంగలు అపహరించినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన ఎస్‌ఐ సురేష్‌గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్లు సేకరించిందని, ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలల్లో దొంగ బీభత్సం

- మధ్యాహ్న భోజనం సరుకులు, కంప్యూటర్ చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్ల జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు పగులగొట్టి విద్యార్థుల మధ్యాహ్న భోజనం సరుకులను, కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపిన వివరాలు.. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్నం భోజనం తయారు చేసే వంట గది తాళాలను సోమవారం రాత్రి పగలగొట్టి సిలిండర్, బియ్యం, కుక్కర్, గుడ్లు, కందిపప్పు, నూనెతో పాటు వంట సామగ్రి దోచుకెళ్లారు. జెడ్పీహెచ్‌ఎస్‌లోని కంప్యూటర్ మానిటర్‌ను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయాన్నే చూసిన గ్రామస్తులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారమిచ్చారు. వారు పాఠశాలలకు చేరుకొని ఎంఈఓ, డీఈఓలకు సమాచారమిచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.